లక్ష్యానికి అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, డిసెంబర్ 5 : స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను లక్ష్యానికి అనుగుణంగా మంజూరు చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో రెండో త్రైమాసిక బ్యాంకర్ల జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లాలో స్వల్ప, దీర్ఘకాలిక, మౌలిక సదుపాయాల రుణాలు, విద్యా, గృహ, స్వయం సహాయక బృందాలకు రుణాలు, ఇతర ప్రాధాన్యత పథకాలకు సంబంధించిన వాటిపై కలెక్టర్ సమీక్షించారు. రెండో త్రైమాసికంలో సాధించిన ప్రగతి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సాధించాల్సిన ప్రగతులపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వార్షిక క్రెడిట్ ప్లాన్ 4,695 కోట్లు కాగా సెప్టెంబర్ మాసాంతం వరకు 2030 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. నిర్ణయించిన ప్రగతి సాధించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం ప్రవీణ్, భారత రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం రహమాన్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రవికాంత్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్డు నంబర్లను సరిచేయాలి

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో వార్డు నంబర్లను సరిచేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్డీవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో వార్డు నంబర్లు తప్పుగా నమోదు అయ్యాయని, ఓటరు జాబితా, ఇంటి నంబర్ల ప్రకారం వార్డు నంబర్ వేసి సరిచేయాలని సూచించారు. ఇందుకు పంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. మున్సిపల్ వార్డుల్లో నంబర్లను కూడా సరిచేసుకోవాలని చెప్పారు.
నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించాలని తహసీల్దార్లు, ఈఆర్‌వోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, సీపీవో రాజారాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేసుకోవాలి

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి మిఫ్తా ఫైజుల్లా

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 5 : రైతులు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మిఫ్తా ఫైజుల్లా సూచించారు. ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దేశాయిపేట్ రైతు వేదికలో భూసార పరీక్షలపై గురువారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. తరుచూ ఒకే రకమైన పంటలను సాగు చేయడంతో భూమిలో సారం తగ్గి దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు తమ భూముల్లోని మట్టి నమూనాలు సేకరించి తీసుకొస్తే ఉచితంగా భూసార పరీక్షలు చేయిస్తామని తెలిపారు. పంట మార్పిడి చేస్తే రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఏఈవో దత్తేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

కామారెడ్డి, డిసెంబర్ 5 : జీవితంపై విరక్తిచెంది మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన వంగరి బాలయ్య కుమార్తె శిరీష(29) ఎనిమిది ఏండ్ల కిందట స్వామిని ప్రేమ వివాహం చేసుకున్నది. వీరు జిల్లా కేంద్రంలోని భూపుత్రమ్మ కల్యాణ మండపం వద్ద ఉంటున్నారు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి ఆర్థిక పరిస్థితి బాగాలేక స్వామి సౌదీ అరేబియాకు వెళ్లాడు. బుధవారం రాత్రి శిరీష ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి వంగరి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

అప్పులు కట్టలేక ఓ వ్యక్తి

కామారెడ్డి, డిసెంబర్ 5 : అప్పులు కట్టలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాల ఇలా ఉన్నాయి. కామారెడ్డిలోని కేపీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కొండా పవన్‌కుమార్(42) వెల్డింగ్ పని చేస్తూ రెండు సంవత్సరాల క్రితం రామారెడ్డి మండలం రెడ్డిపేట్ నుంచి కామారెడ్డి వచ్చాడు. బ్యాంకులో అప్పు చేసి ఇల్లు కొన్నాడు. తీసుకున్న అప్పులు చెల్లించలేక మనస్తాపానికి గురయ్యాడు. భార్య రెడ్డిపేట్‌లోని డ్వాక్రా గ్రూప్‌లో డబ్బులు చెల్లించడానికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

వాహనదారులకు జరిమానా

బీబీపేట్(దోమకొండ), డిసెంబర్ 5 : దోమకొండలోని సంగమేశ్వర్ చౌరస్తా వద్ద ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో కలిసి గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలను లేని 60 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎస్సై సూచించారు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దంత వైద్య శిబిరం

విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యుడు రాకేశ్

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 5 : అంతర్జాతీయ స్వచ్ఛత దినోత్సవాన్ని పురస్కరించుకొని మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, సేవా సంఘ్ ఫ్రెండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో దంత వైద్య నిపుణుడు రాకేశ్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దంతాలను ప్రతిరోజూ ఉదయం, రాత్రి శుభ్రం చేసుకోవడంతో దంతాలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీబాయి, ఎన్‌వైకే వలంటీర్ సునీల్ రాథోడ్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

'ఈ ప్రభుత్వానికి సంబురాలు ఎందుకో..'

కామారెడ్డి/బాన్సువాడ టౌన్, డిసెంబర్ 5 : అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొత్తగా ఒక పింఛన్, ఒక రేషన్ కార్డు ఇవ్వని ప్రభుత్వానికి సంబురాలు ఎందుకని బీజేపీ నాయకులు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై కామారెడ్డి, బాన్సువాడలో గురువారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఒక్కరికి కూడా సొంతింటి కల నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను తిట్టడం తప్పా ఏడాది కాలంనుంచి రేవంత్ రెడ్డి చేసింది ఏమి లేదని అన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయండి..

బాన్సువాడ, డిసెంబర్ 5 : బాన్సువాడలో జిల్లాస్థాయి సైన్స్ ఫేర్, ఇన్‌స్పైర్‌ను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆయన మాట్లాడారు. గతంలో జిల్లా కేంద్రంలోనే నిర్వహించే సైన్స్‌ఫేర్, గ్రామీణ ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం బాన్సువాడలో నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 400పైగా ప్రాజెక్టులను ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. ఇది వరకు ఇన్‌స్పైర్‌కు 78 ప్రాజెక్టులను ఎంపిక చేశామని చెప్పారు. వైజ్ఞానిక ప్రదర్శణలో ప్రతిభా కనబర్చిన 23 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయికి ఎంపిక చేశారని అన్నారు. ప్రాజెక్టులను ప్రదర్శించే విద్యార్థులతోపాటు ఉపాధ్యాయుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం వసతిగృహాల్లో బస కోసం ఏర్పాట్లు చేశామని అన్నారు. భోజన సదుపాయాన్ని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఏర్పాటు చేశారని తెలిపారు.
నేటి వైజ్ఞానిక సదస్సుకు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ఖగోళ దృశ్యాల వీక్షన ఉంటుందని చెప్పారు. చుట్టు పక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి కుషాల్, తపస్ జిల్లా కార్యదర్శి సంతోష్, పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు లక్క నరహరి, మంద ప్రవీణ్, రవీందర్, శ్రీకాంత్ , రామకృష్ణ, నర్వ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మాచారెడ్డి,డిసెంబర్ 5 : మాచారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై కామారెడ్డి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళా బృందం సభ్యులు మాట్లాడారు. మాదక ద్రవ్యాలను వినియోగించవద్దని సూచించారు. అనంతరం షీటీం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యాకునుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యులు

వరి కొయ్యలను కాల్చితే భూసారం దెబ్బ తింటుంది

వరి కొయ్యలు కాల్చడంతో కలిగే నష్టాలను రైతులకు వివరిస్తున్న దత్తేశ్వరీ

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 5 : రైతులు పంటలను కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చడంతో భూసారం దెబ్బతినడంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుందని దేశాయిపేట్ క్లస్టర్ ఏఈవో దత్తేశ్వరీ అన్నారు. దేశాయిపేట్ గ్రామ శివారులో గురువారం వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో కలిగే నష్టాలపై రైతులకు వివరించారు. వరి కొయ్యలను దుక్కిలోనే దున్ని నీళ్లు పెడితే కొయ్యలు నీటిలో మురిగి ఎరువుగా మారి భూమికి సారం పెంచుతుందన్నారు. కొయ్యలకు కాల్చకుండా దుక్కిలోనే దున్నేయాలని సూచించారు.

నేల సారాన్ని కాపాడుకోవాలి

రాజంపేట్, డిసెంబర్ 5 : మండలంలోని కొండాపూర్, తలమడ్ల, రాజంపేటలోని రైతు వేదికల్లో ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి శృతి మాట్లాడుతూ.. వరి కొయ్యలను కాల్చవద్దని సూచించారు. రైతులకు నేల సారాన్ని కాపాడే పద్ధతులు, పచ్చి రొట్టె, సేంద్రియ ఎరువుల వాడకంతో నేల సారాన్ని పెంచుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

పుస్తకాలు అందజేసిన దంపతులను సన్మానిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

కామారెడ్డి, డిసెంబర్ 5 : జిల్లా కేంద్రానికి చెందిన ఆకుల కవిత–గోపీకృష్ణ దంపతులు జిల్లా గ్రంథాలయానికి లక్షా 26 వేల రూపాయల విలువైన పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గురువారం వారిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మౌనిక, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 5: మండల కేంద్రం గోపాల్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రజావాణి ఫిర్యాదుపై డీఎల్‌పీవో సురేందర్ విచారణ చేపట్టారు. గోపాల్‌పేటకు చెందిన బోయిని రాజశేఖర్ తమ ల్యాండ్‌పై ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో గురువారం వారిని గ్రామ పంచాయతీలో విచారణ చేశామని, సేకరించిన వివరాలను కలెక్టర్‌కు పంపుతామన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

మద్నూర్, డిసెంబర్ 5: ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్సై విజయ్ అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఆటోలకు సంబంధించి అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోరాదని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపరాదని, మద్యంతాగి నడపవద్దని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్సై

సమ్మెకు సిద్ధం కావాలి

లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్ 5: సమగ్రశిక్షా ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కావాలని సర్వశిక్షా అభియాన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ సూచించారు. తాడ్వాయి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నిరస దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే 9వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు వెల్లడించా రు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

బడిబయటి విద్యార్థుల గుర్తింపు

ముస్తాపూర్ గ్రామంలో ఇటుక బట్టీల వద్ద బడి బయటి విద్యార్థులతో ఉపాధ్యాయులు

లింగంపేట, డిసెంబర్ 5: మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో గురువారం బడి బయటి విద్యార్థులను గుర్తించినట్లు ఎంఈవో షౌఖత్ అలీ తెలిపారు. గ్రామంలో ఇటుకల తయారీ కోసం మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన కూలీలు వారి పిల్లలతో వలస వచ్చారని, వారి కుటుంబాల్లో 14 మంది బడి ఈడు పిల్లలు ఉన్నారని అన్నారు. వీరికోసం రెండు, మూడు రోజుల్లో ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేస్తామని ఎంఈవో తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వరంగ సంస్థ)
అసెట్ రికవరీ శాఖ
249/3RT, మొదటి అంతస్తు, S.R. నగర్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500 038.

ఇ-వేలం అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధన చూడండి)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. దిగువ తెలిపిన రుణగ్రహీత(లు) మరియు హామీదారు (లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దిగువ తెలిపిన బకాయిలు రాబట్టుకొనుట కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారిచే లాంఛనప్రాయ/భౌతిక స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించిన స్థిరాస్తి "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన దిగువ తెలిపిన తేదీన విక్రయించబడుతుందని సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. రిజర్వు ధర, బయానా దిగువ తెలియజేయబడినవి:

1 రుణగ్రహీత పేరు మరియు చిరునామా: 1) మెసర్స్ వజహత ఏజెన్సీస్ (యజమాని: మీర్ వజహత్ అలి), బ్రైట్ స్కూల్ సమీపాన, ఈద్గ రోడ్, పిట్లం గ్రామం మరియు మండలం, కామారెడ్డి జిల్లా, తెలంగాణ-503310. యజమాని మరియు హామీదారు: 2. శ్రీ మీర్ వజాహత్ అలి, బ్రైట్ స్కూల్ సమీపాన, ఈద్గ రోడ్, పిట్లం గ్రామం మరియు మండలం, కామారెడ్డి జిల్లా, తెలంగాణ-503310. హామీదారు కమ్ తనఖాదారు: శ్రీమతి రజియా సుల్తానా భర్త స్వర్గీయ అయూబ్ అలి, ఇం.నెం.9-96/8/ఎ3, బ్రైట్ స్కూల్ సమీపాన, ఈద్గ రోడ్, పిట్లం గ్రామం మరియు మండలం, కామారెడ్డి జిల్లా, తెలంగాణ-503310.
స్థిర సెక్యూర్డ్ ఆస్తిని విక్రయించుట ద్వారా రాబట్టుకోవలసిన సెక్యూర్డ్ రుణం: 31.10.2024 నాటికి రూ. 1,12,98,492.95 మరియు తదుపరి వడ్డీ, వ్యయాలు మరియు ఖర్చులు.
విక్రయించబడు స్థిర సెక్యూర్డ్ ఆస్తుల వివరణ
శ్రీమతి స్వర్గీయ రజియా సుల్తానా కి చెందిన, శ్రీ సాయి స్కూల్ ప్రక్కల, ఈద్గ రోడ్, పిట్లం గ్రామం మరియు మండలం, కామారెడ్డి జిల్లా, తెలంగాణ-503310 వద్ద గల, సర్వే నెం.916/ఎలో 1200 చ.గజాలు విస్తీర్ణపు ప్లాట్‌పై నిర్మించబడిన, ఇం.నెం.9-96/8/ఎ3 కలిగిన, ఆర్‌సిసి బిల్డింగ్, నివాస మరియు స్కూల్ బిల్డింగ్ కలిగిన స్థిరాస్తి యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: రోడ్, తూర్పు: రోడ్, పడమర: రోడ్.
రిజర్వు ధర: రూ. 95,00,000/- బయానా రూ. 9,50,000/- బిడ్ పెంపుదల: రూ. 95,000/-
ఇ-వేలం తేది మరియు సమయం: 24-12-2024, మ॥ 12.00 గం. నుండి సా॥ 5.00 గం. మధ్య
(10 నిమిషాల అపరిమిత ఆటో ఎక్స్‌టెన్షన్స్‌తో) ఇ-వేలం వెబ్‌సైట్- https://ebkray.in
బయానా దాఖలు కొరకు ఆఖరి తేది: వేలం ప్రక్రియలో పాల్గొనుటకు ముందులోగా డిపాజిట్ చేయవలెను.
మొబైల్ నెం. మరియు చెల్లుబాటగు ఇ-మెయిల్ ID ఉపయోగించి https://ebkray.inలో రిజిస్టర్ అవ్వండి. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు https://ebkray.in యొక్క హోం పేజ్‌లో ఏర్పాటు చేసిన బయ్యర్ మ్యాన్యువల్ లింక్‌ను దర్శించండి. విచారణల కొరకు సంప్రదించండి: 8291220220 ఇ-మెయిల్ ID support.ebkray@psballiance.com. ఇ-వేలం అమ్మకం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనుటకు మరియు వారి బిడ్డను దాఖలు చేసేముందు వేలం అమ్మకం యొక్క సవివరమైన నియమనిబంధనల కొరకు బిడ్డర్లు వెబ్‌సైట్ https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.inను చూడవలసిందిగా బిడ్డర్లకు సూచించడమైనది. గెలుపొందిన బిడ్డరు ఇ-బిడ్డింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత ఇ-మెయిల్ ద్వారా తెలియజేయబడును. ఆసక్తిగల బిడ్డరు సంప్రదించగలరు: అధీకృత అధికారి, 249/3RT, 1వ అంతస్తు మెయిన్ రోడ్డు SR నగర్, హైదరాబాద్ - 500038, మొబైల్ నెం. 9987321173 / 9885599551.
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/ రూల్ 9(1) క్రింద చట్టబద్ధ 15 రోజుల అమ్మకం ప్రకటన
పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకం నిర్వహించుట గురించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/లు మరియు హామీదారు/లకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)/రూల్ 9(1) క్రింద నోటీసుగా కూడా దీనిని పరిగణించవలెను.
ప్రదేశం: హైదరాబాద్.తేది: 02-12-2024, అధీకృత అధికారి,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ శాఖ.

నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులదే

వరి కొయ్యలు కాల్చవద్దని రైతులతో ప్రమాణం చేయిస్తున్న డీఏవో తిరుమల ప్రసాద్

లింగంపేట/ లింగంపేట(తాడ్వాయి)/ఎల్లారెడ్డి రూరల్/గాంధారి /, డిసెంబర్ 5: జిల్లాలో గురువారం మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ వరి కొయ్యలు కాల్చడం వల్ల భూమి వేడెక్కి భూసారం తగ్గిపోతుందన్నారు. నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులదేనన్నారు. మట్టి నమూనాల సేకరణ, భూసారా పరీక్షలతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఎల్లారెడ్డి మండలం మీసానిపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నదీమొద్దీన్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.ఆయనతో పాటు ఏఈవో రాజాగౌడ్, రైతులు కిషన్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు. గాంధారి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించిన సమావేశంలో ఏఈవో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ భూముల్లో సేంద్రియ ఎరువులు వేసి భూసారం పెంచుకోవాలని సూచించారు. దుర్గం ఏఈవో రాజశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు. లింగంపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్, ఏఈవో మధుసూదన్, షేక్ అమీర్, సంతోష్, రాకేశ్, నవ్య, రైతులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో అవినీతికి అడ్డుకట్ట వేయాలి

● రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగం సురేందర్

సంచుల్లో కుట్టిపెట్టి ఉంచిన నూకలు, దుమ్ము, తవుడు, మెరిగలతో కూడిన బియ్యాన్ని చూపుతున్న దృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 5 : ఎల్లారెడ్డి ఎంఎల్ఎస్ పాయింట్‌లో భారీ అవకతవకలు జరుగుతున్నాయని, అవినీతికి అడ్డుకట్ట వేయాలని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగం సురేందర్ కోరారు. ఎల్లారెడ్డి ఎంఎల్ఎస్ పాయింట్‌కు గురువారం విలేకరులు వెళ్లగా.. అక్కడ జరిగిన అవినీతి భాగోతం కండ్లకు కట్టినట్లు కనిపించింది. ఈ సందర్భంగా నాగం సురేందర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆగస్టులో పెద్దపల్లి, జగిత్యాల నుంచి డ్యామేజీ బియ్యం లోడ్‌ఎల్లారెడ్డికి వచ్చిందని తెలిపారు. అవి రేషన్ దుకాణాలకు సరఫరా చేశారని, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారని, దినపత్రికల్లో కథనాలు వచ్చాయని తెలిపారు. దీంతో డీఎం ఎల్లారెడ్డికి వచ్చి, రేషన్‌దుకాణాలకు సరఫరా అయిన బియ్యాన్ని పరిశీలించి, వాటిని తిరిగి పెద్దపల్లి, జగిత్యాలకు వాపస్ పంపాలని సూచించారని చెప్పారు. ఆ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తెచ్చి, అక్టోబర్ వరకు అలాగే ఉంచారని అన్నారు. అక్టోబర్ నెల కోటా కింద ప్రతి రేషన్ దుకాణానికీ కొన్ని సంచుల చొప్పున తిరిగి వాటిని పంపినట్లు తెలిపారు. దీనిపై రేషన్ డీలర్లు ప్రశ్నించగా.. అధికారులు చెప్పిన విధంగా పంపుతున్నానని గోదాం ఇన్‌చార్జి బాలయ్య చెప్పారని వివరించారు. నవంబర్ 13న తాను ఎంఎల్ఎస్ పాయింట్‌కు వెళ్లగా .. పాడైపోయిన బియ్యాన్ని మంచి బియ్యంతో కలుపుతుండడం చూశానని, ఈ విషయాన్ని ప్రశ్నించగా డీఏవో కృష్ణ అధికారుల ఆదేశాల మేరకు చేస్తున్నట్లు చెప్పారని వెల్లడించారు. ఆ బియ్యాన్ని అలాగే ఉంచాలని, సంచుల్లోకి నింపవద్దని తాను చెప్పగా.. డిసెంబర్ 1వ తేదీ వరకు కుప్పగా ఉంచిన బియ్యాన్ని సంచుల్లో నింపి, రేషన్ దుకాణాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేశారని చెప్పారు.

ట్రక్‌షీట్ల ద్వారా కూడా భారీ మోసాలు..

ట్రక్‌షీట్ల ద్వారా కూడా అధికారులు, సిబ్బంది భారీ మోసాలకు తెరలేపారని నాగం సురేందర్ ఆరోపించారు. స్టేజ్ -1 పాయింట్ నుంచి బియ్యం సంచుల లోడుతో ఉన్న లారీ వే బ్రిడ్జికి వెళ్లే సమయంలో 610 బస్తాలు ఉన్నట్లు రాస్తారని, లారీలో 612 నుంచి 615 బస్తాల వరకు ఉంటాయని తెలిపారు. వాటిని రేషన్ దుకాణాలకు పంపగా అక్కడ బియ్యం తక్కువగా వస్తుండడంతో లారీని అదే వే బ్రిడ్జికి పంపి తూకం వేయించగా ఒక క్వింటాల్ 35 కిలోలు తక్కువగా వచ్చినట్లు తెలిపారు. లారీలో ఎక్కువగా వేసిన బస్తాలు ఎక్కడికి వెళ్తున్నాయని ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ బాలయ్యను ప్రశ్నిస్తే తాను ఎలావస్తే అలా పంపుతున్నానని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇలా మార్చి నుంచి తేడా వస్తున్నదని, ప్రతి లారీకి 2 నుంచి 4 క్వింటాళ్ల వరకు బియ్యం తేడా వస్తున్నదని, స్టేజ్ -1 పాయింట్, స్టేజ్ -2 పాయింట్‌ను ఒకే వ్యక్తి నిర్వహిస్తుండడంతో ఈ గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆరోపించారు. ఈ విషయమై ఎంఎల్ఎస్ పాయింట్ డీటీ బాలయ్యను వివరణ కోరగా.. పెద్దపల్లి నుంచి 2వేల 500 బ్యాగులు, జగిత్యాల నుంచి 500 సంచుల బియ్యం వచ్చాయని, వాటిని వాపస్ పంపాలని డీఎం ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. బియ్యం సంచులను రేషన్‌షాపులకు పంపకుండా పక్కన పెట్టామని, ఇప్పటివరకు ఎవరికీ పంపలేదని అన్నారు. పాడైపోయిన బియ్యాన్ని మంచి బియ్యంతో ఎందుకు కలిపారోనని ప్రశ్నించగా.. సమాధానం దాటవేశారు.

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరం

లింగంపేట, డిసెంబర్ 5: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని తహసీల్దార్ నరేందర్ సూచించారు. లింగంపేట రైతువేదిక వద్ద సీఎం కప్ 2024 క్రీడల నిర్వహనపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గ్రామాల్లో 7, 8 తేదీల్లో సీఎం కప్ క్రీడలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో నరేశ్, ఎంఈవో షౌఖత్ అలీ, పీడీ రాజాగౌడ్, ఎస్సై సుధాకర్, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వహిద్ సిద్దిఖీ, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

న్యాయవాది కూతురు పెండ్లికి మాజీ ఎమ్మెల్యే హాజరు

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్, మాజీ మంత్రి నేరెళ్ల

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 5: హైదరాబాద్‌లో .. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, మాజీ జడ్పీటీసీ సాయిప్రకాశ్ దేశ్‌పాండే కూతురు వివాహానికి గురువారం మాజీ ఎమ్మెల్యే సురేందర్, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం విందులో పాల్గొన్నారు. పెండ్లికి హాజరైన వారిలో ఎల్లారెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ రవిందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు లొంకలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు నామ శ్రీనివాస్, నామ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

లింగంపేట, డిసెంబర్ 5: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఇన్స్‌పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సోలంకి రవళి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. లక్ష్యం ఏర్పర్చుకొని ముందుకు సాగడం వల్ల జీవితంలో స్థిరపడవచ్చన్నారు. చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

రామారెడ్డి, డిసెంబర్ 5 : మండలంలోని గొల్లపల్లి రోడ్డు వద్ద స్థానిక ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. పలువురికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. సరైన పత్రాలు చూపని వాహన చోదకులకు జరిమానా విధించారు. అనంతరం ఎస్సై మట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా రోడ్డు భద్రత నిభందనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు.

'రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి'

గాంధారి, డిసెంబర్ 5: బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న అర్హులైన ప్రతి ఒక్క రైతుకూ రూ.రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం కిసాన్ సంఘం నాయకులు సమావేశమై మాట్లాడారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మాధవరావు, శంకర్‌రావు, రావుసాహేబ్‌రావు, సూర్ల కిషన్, రమేశ్‌రావు, సాయిలు, గంగిరెడ్డి తదితరులు ఉన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I BODAS CHINNA NARSAIAH S/O NARSIMLU R/O H.no 4-2/2 Chittapur Balkonda,Nizamabad. I Have Changed My Name /Surname As BODAS NARSAIAH.
NTZ-338234

PLOT FOR SALE
★డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.